రసమయి ఇంటిపై దాడి హేయమైన చర్య

ఇల్లంతకుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడిచేయడం హేయమైన చర్య అని మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు సలీం ఒక ప్రటనలో పేర్కొన్నాడు. రాజకీయాలలో విమర్శలు, ప్రతి విమర్శలు సహజం అని ఇలా ఇళ్లపై దాడులు చేసి భయభ్రాంతలకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నాడు. రసమయి ఇంటిపై దాడిచేసి అద్దాలను పగలగొట్టిన వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అగ్నిప్రమాదం సంభవిస్తే 101కు కాల్‌చేయండి

- సిరిసిల్ల ఫైర్ అధికారి నరెందర్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచాలు కాల్చడం ద్వారా ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే 101, 8712699259కు కాల్ చేయాలని సిరిసిల్ల ఫైర్ అధికారి వి.నరెందర్ తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా ఆయన ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. దీపావళికి ప్రతి దుకాణంలోనూ నోములు చేసుకుంటూ టపాసులు కాల్చుతుంటారని, ఇందుకు నిబంధనలు పాటించాలన్నారు. పెద్దల సమక్షంలో చిన్నపిల్లలు బాణాసంచాలు కాల్చే విధంగా చూడాలన్నారు. బాణాసంచాలు కాల్చేటపుడు కాటన్ దస్తులు ధరించాలన్నారు. చిన్నచిన్న తప్పిదాల కారణంగా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకొని దీపావళిని ఆనందంగా జరుపుకోవాలన్నారు.

దీపావళి సందర్భంగా జిల్లాలో ఏర్పాటుచేసిన 85 టపాసుల దుకాణాల వద్ద నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇతర ప్రాంతాల నుంచి టపాసులు దిగుమతి చేసుకొని నిల్వలుచేసే సమయంలో తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టపాసుల దుకాణాలు ఏర్పాటుచేసే స్థలయజమాని వద్ద ఎన్‌వోసీ పత్రాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుచేసిన వారికి నిబంధనల ప్రకారం అనుమతి ఇచ్చామన్నారు. జనవాసాలకు దురంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి దుకాణం మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలన్నారు. దుకాణాలను జీఐషీట్‌తో ఏర్పరిచి ఎలక్ట్రిక్ ఫిటింగ్ ఉండాలన్నారు. ప్రతి షాప్‌నకు 5కేజీల సామర్థ్యంగలడీసీపీ అందుబాటులో ఉండాలన్నారు.



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అమావాస్య చీకట్లను పారద్రోలి వెలుగులను పంచే ఆనందోత్సాహాల దీపావళి పండుగ రానే వచ్చింది. దీపావళి దివ్య దీపాల వరస.. అజ్ఞానపు పొరల్ని తొలగించి విజ్ఞానపు వెలుగులను నింపుతుంది. తాను కరిగిపోతూ సకల జనుల జీవితాల్లో వెలుగులు నింపాలని దివ్యంగా జరుపుకునేది దీపావళి. ప్రతి ఇంట్లో అందరి జీవితాల్లో వెలుగులు తీసుకవస్తూ మనుమల్లో దాగి ఉన్న విచారాన్ని పోగొట్టి ఆనందాన్ని వికసింపజేసేదే దీపావళి. సంతోషానికి సంకేతంగా సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు దీపావళిని ఘనంగా జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. లక్ష్మిపూజలతో దీపావళి పండుగను జరుపుకుంటున్నారు. జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంతో పాటు వివిధదేవాలయాల్లో దీపావళి వేడుకలకు ప్రత్యేకపూజలకు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 5.30గంటల నుంచి 6.30గంటల వరకు హారతులు, మధ్యాహ్నం 3.05గంటల నుంచి రాత్రి 10.35 గంటల వరకు ధనలక్ష్మి పూజలు, కేదారేశ్వర నోములు జరుపుకోవచ్చని పండితులు చెబుతున్నారు. వేములవాడ దేవస్థానంలో తెల్లవారు జామున ఉదయత్పూర్వం 3.30 గంటల నుంచి 3.40 గంటల వరకు, మంగళవాయిద్యాలు 3.40 నుంచి 4.20 వరకు, సుప్రభాత హారతి 4.30 నుంచి 4.40 నిమషాల వరకు, నరక చతుర్ధశి, దీపావళి పండుగ హారతి 4.40 నుంచి 5 గంటల వరకు, ఆలయ శుద్ధి 5 గంటలకు, దీపావళి పండుగ సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి నరకాసుర వధ పురాణ కాలక్షేపం, 6.30 గంటల నుంచి స్వామివారి కల్యాణ మండపంలో ధనలక్ష్మి పూజ నిర్వహిస్తారు.

దీపం జ్ఞానానికి ప్రతీక..

దీపం జ్ఞానానికి ప్రతీక. ఏ శుభకార్యం జరిగినా జ్యోతి ప్రజ్వలనతోనే మొదలవుతుంది. దీప కాంతిని త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ప్రతీకలుగా కొలుస్తారు. దీపం సాక్షాత్తు లక్ష్మీదేవి, దీపావళి నాడు జగత్‌నం తటికి కాంతి మయం చేస్తుంది. ప్రతివ్యక్తి జీవితంలో దైవం ప్రాముఖ్యతను దీపావళి చాటుతుంది. మనోహ రమైన దీపాలను ఇంటి ముంగిట, దేవాలయాల్లో, మఠాలలో, ప్రకారాలలో, గోశాల, వీధుల వెంబడి, వెలిగిం చాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదివారం లక్ష్మీదేవి పూజ లను నిర్వహించడానికి వాణిజ్య సంస్థలు, దుకా ణదా రులు, ప్రజలు ఘనంగా ఏర్పాట్లు చేసుకున్నారు. దీపా వళికి శోభనిచ్చే విధంగా టపాసుల అమ్మకాలు, నోరూ రించే మిఠాయిలు, దుకాణాలను విద్యుత్ దీపాలకాంతు లతో వెలిగి పోయే విధంగా ముస్తాబు చేశారు.

వివిధ రాష్ట్రాల్లో...

దీపావళి పండుగ మన రాష్ట్రంతోపాటు వివిధ రాష్ట్రాల్లో కూడా ఎంతో ఆనందంగా జరుపుకుంటారు. అస్సాం, బెంగాల్‌లో జగదాత్రి పూజగా చేసుకుంటారు. ఒరిస్సాలో కూమార పూర్ణిమగా జరిపి దీపావళి వరకు కన్యలు ఆనంద దీపోత్సవాలతో ఆటపాటలతో కాలక్షేపం చేస్తారు. దక్షిణ భారతంలో బలి చక్రవర్తి అణిచిన మహావిష్ణువు విజయంగా కొందరు నరకాసుర వధ చేసిన శ్రీకృష్ణ విజయంగా పండుగను జరుపుకుంటారు. కేరళలో బలిచక్రవర్తిని జయించిన విజ యోత్సవంగా, తమిళనాడులో తెల్లవారుజామున లేచి నరక చతుర్దశి జరుపుకుంటారు. కర్ణాటకలో మూడు రోజులపాటు పండుగ జరుపుకుంటే రాజస్థాన్‌లో దస్ తెరాస్‌గా జరుపుకుంటారు. మహిళలు ఆ రోజు నగలను నదిలో శుభ్రంచేసి పిల్లిని లక్ష్మిదేవిగా పూజిస్తారు. అన్ని రకాల వంటలు పిల్లికి నైవేద్యంగా పెడుతారు. గుజరాత్‌లో పిండివంటలతో లక్ష్మీదేవికి పూజలు చేస్తారు. మహారాష్ట్రలో లక్ష్మిపూజ, గణేష్ పూజ జరుపుతారు. మార్వాడిలు దీపావళి రోజునుండే

- మిగతా 8లో...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జిల్లా ప్రధాన కార్యదర్శి

చందుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావును ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ కలిశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సర్దార్ వల్లభాయి పటేల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యశాలలో శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వేములవాడ రాజరాజేశ్వర స్వామి కండువాతో రామచంద్రరావును సత్కరించి, లడ్డు ప్రసాదంను అందజేశారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించ కృతనిశ్చయంతో ముందుకు వెళుతందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వివిధ రకాలుగా సమాజిక సేవ చేస్తుందని కొనియాడారు. వైద్య శిబిరానికి వచ్చిన వారిని పరీక్షించి వారికి తగిన మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఎక్కడైన ఎప్పుడు విపత్తులు సంభవించిన క్లబ్ ముందుంటుందని అన్నారు. ఆనాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీని ప్రారంభిస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచడం జరిగిందని వివరించారు. ప్రైవేటు రంగం వారు కూడా పేదవారికి సహకారం అందించాలని సూచించారు. మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంఘ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంఘ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని గౌడ సంఘ అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య పేర్కొన్నారు. మండలకేంద్రంలోని రేణుకాదేవి ఆలయంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రేణుకాదేవి ఆలయంలో సరైన వసతులు ఏర్పాటు చేసినందున భక్తుల సంఖ్యపెరిగిందన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రతినెల పౌర్ణమి రోజున అన్నప్రసాద వితరణ చేయడానికి సుదగోని వంశస్థులు నిర్ణయం తీసుకోవడం జరిగింది. కార్యక్రమంలో నాయకులు సుదగోని మల్లయ్య, సుదగోని పర్శరాంగౌడ్, ఆంజనేయులు, హన్మండ్లు, నాగేంద్రం, సుదగోని సత్యనారాయణ, సుదగోని రాంబాబు, సత్యనారాయణ, కమలాకర్‌లతో పాటు గౌడసంఘ నాయకులు పాల్గొన్నారు.

మద్యం టెండర్ల గడువు పెంపుతో ఆశలు..

- 23 వరకు దరఖాస్తులకు గడువు - 27న కలెక్టరేట్‌లో లక్కీడ్రా..

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం టెండర్ల దరఖాస్తు గడువు పెంచినప్పటికీ వ్యాపారుల నుంచి స్పందన వస్తుందని ఎక్సైజ్ శాఖ ఆశలు పెట్టుకుంది. గడువు పెంపుతో ఎక్సైజ్ శాఖ ఆశ ఫలిస్తుందా వేచిచూడాల్సిందే. వైన్స్‌లకు దరఖాస్తుల దాఖలుకు శనివారంతో గడువు ముగిసినప్పటికీ ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదని ఎక్సైజ్‌శాఖ గుర్తించి ఈనెల 23వరకు వైన్స్‌లు దక్కించుకునేందుకు దరఖాస్తు దాఖలు చేసే అవకాశం ఇచ్చింది. అయితే ఆది, సోమవారాలు సెలవులు కావడంతో కేవలం మూడు రోజులే దరఖాస్తుల దాఖలుకు గడువు ఉంది. అనంతరం ఈనెల 27న సమీకృత కలెక్టరేట్‌లో లక్కీ డ్రా నిర్వహించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు కనీసం ఇంకో 1000 దరఖాస్తులు అయినా వ్యాపారుల వేసేందుకు ప్రయత్నాలు చేయాలని ఎక్సైజ్ అధికారులకు టార్గెట్ ఇచ్చారు. జిల్లాలో వైన్స్‌లను దక్కించుకునేందుకు 23రోజుల్లో 1324మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలోని 48 వైన్స్‌లకు గతంలో 2036 దరఖాస్తులు రాగా ఇసారి 1324 మాత్రమే రావడంతో గతం కంటే 712 దరఖాస్తులు తగ్గాయి. అప్పటి దరఖాస్తుల ద్వారా రూ.40.74 కోట్ల ఆదాయం సమకూరగా దరఖాస్తుల ఫీజు రూ. 3లక్షల వరకు పెంచినప్పటికీ ఈసారి రూ.39.72కోట్లు మాత్రమే రావడంతో రూ. కోటి ఆదాయం తగ్గింది. కాగా, జిల్లాలోని 48 వైన్స్‌లలో ఇప్పటి వరకు సిరిసిల్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 18 వైన్స్‌లకు 578, వేములవాడ పరిధిలోని 16 వైన్స్‌లకు 331, ఎల్లారెడ్డిపేట పరిధిలోని 14 వైన్స్‌లకు 415 దరఖాస్తులు వచ్చాయి. గడువు పెంచడంతో మరిన్ని దరఖాస్తులు పెరిగే అవకాశం లేకపోలేదు.

జిల్లెల్లకు అత్యధికం.. రుద్రంగికి అత్యల్పం..

జిల్లాలోని జిల్లెల్ల వైన్స్‌కు 51దరఖాస్తులు అత్యధికంగా రాగా రుద్రంగి వైన్స్‌కు అత్యల్పంగా 13దరఖాస్తులు వచ్చాయి. రిజర్వేషన్‌ల ప్రక్రియలో దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో సిరిసిల్ల-1లో 27, 2లో 30, 3లో 27, 4లో 29, 5లో 32, 6లో 40, 7లో 32, 8లో 31, తంగళ్లపల్లి-39, తంగళ్లపల్లి-2లో 35, జిల్లెల-51, కొదురుపాక-21, సారంపల్లి-32, ఇల్లంతకుంట-1లో 37, ఇల్లంతకుంట-2లో 46, పొత్తూరులో 35, బోయిన్‌పల్లిలో 17, వెంకట్రావుపల్లిలో 17, వేములవాడ-1లో 18, 2లో 18, 3లో 19, 4లో 18, 5లో 21, 6లో 27, 7లో 22, నందికమాన్‌లో 31, తిప్పాపూర్-1లో 22, తిప్పాపూర్-2లో 19, రుద్రంగి-1లో 15, రుద్రంగి-2లో 13, హన్మాజిపేటలో 18, ఫాజుల్‌నగర్‌లో 25, చందుర్తిలో 25, మర్రిగడ్డలో 20, లింగన్నపేటలో 47, గంబీరావుపేట-1లో 33, గంబీరావుపేట-2లో 32, ఎల్లారెడ్డిపేట-1లో 25, ఎల్లారెడ్డిపేట-2లో 29, ముస్తాబాద్-1లో 31, ముస్తాబాద్-2లో 46, ముస్తాబాద్-3లో 38, గొల్లపల్లి-1లో 23, గొల్లపల్లి-2లో 21, కోనరావుపేటలో 23, మర్ధనపేటలో 30, నిమ్మపల్లిలో 19, వీర్నపల్లిలో 18 దరఖాస్తులు దాఖలయ్యాయి.

ఎమ్మెల్యేను కలిసిన గౌడ సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గౌడ సంఘం సభ్యులు ఆదివారం గంగాధరలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. మండల కేంద్రంలో చేపట్టిన రేణుక ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేయాలని విన్నవించామని సభ్యులు పేర్కొన్నారు. గౌడ సంఘం సభ్యులు కార్తీక్‌గౌడ్, లింగాగౌడ్, దేవయ్యగౌడ్, సంతోష్‌గౌడ్, రమేశ్‌గౌడ్‌లు ఉన్నారు.



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను సన్మానిస్తున్న గౌడ సంఘం సభ్యులు

బీసీ బిల్లు పేరుతో మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



సిరిసిల్లలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో బీసీ 42 శాతం రిజర్వేషన్ల పేరుతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లకు మద్దతుగా బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఆమోదం ప్రకటించారన్నారు. బీసీ సంఘాలు చేపట్టిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం మద్దుతు ప్రకటించడం శోచనీయన్నారు. బీసీ బంద్ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆదివారం సిరిసిల్లలో ప్రెస్‌మీట్ పెట్టి బీసీ బిల్లును బీజేపీ అడ్డుకుంటుందన్నారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ 42శాతం బీసీ రిజర్వేషన్‌లో బీసీలు మాత్రమే ఉండాలని, పది శాతం ముస్లింలను చేర్చవద్దని గతంలోనే తన అభిప్రాయాన్ని వెల్లడించారని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు బీసీ నాయకులతో కలిసి బంద్ చేయడం సరైందికాదన్నారు. బీసీలను మభ్యపెట్టడం కోసమే కాంగ్రెస్ పార్టీ ఇటువంటి పనులు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ చెబుతున్న రిజర్వేషన్‌ల ప్రకారం మంత్రి వర్గంలో 8 మంది బీసీలు మంత్రులుగా ఉండాలి.. మరీ ఎంత మంది మంత్రులు ఉన్నారో తెలుసుకోవాలన్నారు. మంత్రి పదవి కోసం ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముందు ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. బీసీలపై ప్రేమ ఉంటే బీసీ విద్యార్థులకు రావాల్సిన రూ 8వేల కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్స్ నిధులను ఎందుకు విడుదల చేయడం లేదన్నారు. బీసీ మహిళా మంత్రి కొండా సురేఖ ఇంటిపైకి పోలీసులను పంపడాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమర్థిస్తున్నారా లేక స్వాగతిస్తున్నారా చెప్పాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నే హరీష తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం

- కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లింపు..



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

7

కర్మను అనుసరించి ఫలితం ఉంటుంది..

- శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి



విగ్రహాలను పరిశీలిస్తున్న విధుశేఖర భారతి స్వామి

7

అక్రమంగా కల్యాణలక్ష్మి లబ్ధి పొందిన మహిళపై కేసు

మంథని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే కల్యాణలక్ష్మి స్కీంను అక్రమంగా పొందిన మంథనికి చెందిన పుట్ట పద్మపై తహసీల్దార్ కుమారస్వామి ఫిర్యాదు మేరకు మంథని పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 14న కేసు నమోదు చేసినట్లు హైకోర్టు న్యాయవాది, మాజీ ఉప సర్పంచ్ ఇనుముల సత్యనారాయణ ఆదివారం తెలిపారు. క్లాస్ వన్ కాంట్రాక్టర్, బీఆర్ఎస్ నేత పుట్ట ముఖేష్ కూతురు ప్రేమ వివాహం చేసుకొంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూతురు పేరిట కల్యాణలక్ష్మి స్కీంలో దరఖాస్తు చేశారు. రెవెన్యూ అధికారుల సహకారంతో తెల్ల రేషన్‌కార్డు, బీపీఎల్ కింద ఆదాయం సర్టిఫికెట్ పొంది ముఖేష్ భార్య పుట్ట పద్మ పేరిట రూ.1.00116 చెక్ జారీ అయిందని తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ ఆర్‌టీఐ యాక్టు ద్వారా ఆధారాలు సేకరించి ఆర్డీవో, జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణ జరిపి తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసినట్లు మాజీ ఉపసర్పంచ్ తెలిపారు.

చికిత్స పొందుతూ జీపీ కార్మికుడి మృతి

తంగళ్లపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌కు చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు భూమయ్య(52) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. శనివారం రాత్రి జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భూమయ్యను సిరిసిల్ల ప్రధాన ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతదేహం

రామడుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గుండి గోపాల్‌రావుపేటకు ఎందిన అనగందల ప్రకాశ్ అజ్మాన్ దుబాయ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. సమాచారాన్ని కుటుంబ సభ్యులు గ్రామానికి చెందిన పూడూరి మల్లేశంకు తెలియజేయడంతో అతను చిలుముల రమేష్, నెరుమట్ల బాబుస్వామికి తెలిపారు. ఈ సమాచారం దుబాయ్‌లో ఉంటున్న దుబాయ్ ఎల్లాల శ్రీనన్న సేవాసమితి అధ్యక్షులు రవి డేవిడ్‌కు తెలుపడంతో వెంటనే స్పందించి మృతుని వివరాలు తెలుసుకొని మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చొరవ చొరవతీసుకున్నారు.

పనులకు గ్రహణం.. లోవోల్టేజీతో సతమతం

- మండలానికి 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు
- ఐదు నెలల క్రితం అగ్రిమెంట్ చేసుకున్న కాంట్రాక్టర్
- ఇంకా ప్రారంభం కాని పనులు

కథలాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న విద్యుత్ లోవోల్టేజీ సమస్య నుంచి విముక్తి కలిగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కథలాపూర్‌కు 220/132 కేవీ సామర్థ్యం గల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసింది. జిల్లా కేంద్రం మినహా ఈ సామర్థ్యం ఉన్న సబ్‌స్టేషన్ ఎక్కడా లేదు. ఈ ప్రాంతంలో అధిక లోవోల్టేజీ సమస్య ఉన్న కారణంగా మండల కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాలకు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించారు. సబ్‌స్టేషన్‌కు అవసరమైన సుమారు మూడెకరాల భూమి కూడా అందుబాటులో ఉండడంతో ఇక్కడే అనువైన ప్రదేశంగా అధికార యంత్రాంగం నిర్మాణానికి మొగ్గు చూపింది. ఇప్పటికే 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఇక్కడ ఉన్నప్పటికీ లోవోల్టేజీ సమస్య తీరడం లేదని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం మండలంలోని ఏడు గ్రామాల్లో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచే గృహ, వ్యవసాయ, వ్యాపార, వాణిజ్య రంగాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ వేసవిలో అధికంగా లోడ్ నమోదవుతోంది. ఈ నేపథ్యంలో 220/ 132 సబ్‌స్టేషన్ అవసరం కాగా అధికారుల అంచనా మేరకు ప్రభుత్వం రూ. 50 కోట్లతో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి టెండర్ పిలిచారు. ఓ కాంట్రాక్టర్ ఈ పనులను దక్కించుకోగా గత మే నెలలో అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఐదు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభింకపోవడంపై ప్రజాప్రతినిధులు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేటాయించిన ఈ భూమి పూర్తిగా కుంటలో ఉండడంతో మొదట మొరం పనులు చేపట్టాల్సి ఉంది. రెండు నెలల కిందట నాలుగు ట్రిప్పుల మొరం వేసి నామమాత్రంగా వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి. కాగా ఇప్పటిదాకా జగిత్యాల, కోరుట్ల, రామగుండం నుంచి కథలాపూర్‌కు విద్యుత్‌ను తెచ్చుకుంటుండగా ఈ సబ్‌స్టేషన్ పూర్తయితే మెట్‌పల్లి మండలం గోధూర్ దాకా 80 టవర్లు ఏర్పాటు చేసి అక్కడికి మిగిలిన విద్యుత్‌ను సర ఫరా చేయనున్నారు. 13 టవర్లు వరద కాలువ వైపు నుంచి వేసి కొత్తగా నిర్మించే సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయమై నిర్మాణ విభాగం ఏఈ కసీఫ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పనులు ప్రారంభించ డానికి ఏర్పాట్లు చేసు కుంటు న్నామన్నారు. టవర్లకు సంబం ధించిన సామగ్రి తెప్పిస్తున్నట్లు చెప్పారు.



సబ్‌స్టేషన్ కోసం కేటాయించిన స్థలం

రోడ్లపై ధాన్యం.. వాహనదారుల ఇబ్బందులు



సైదాపూర్-మొలంగూర్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

సైదాపూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ధాన్యం ఆరబోసేందుకు స్థలం లేకపోవడంతో రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ధాన్యం ఆరబోయడంతో రాత్రి వేళలో ప్రయానించే వహనాదారులు ప్రమాదాలకు గురవతున్నారు. సాగునీరు అందడంతో ఎక్కడ ఖాళీ భూములు కనపడడం లేదు. సైదాపూర్ మండలంలో సుమారు 18వేల ఎకరాలలో వరి సాగు చేశారు. ఇప్పటికైనా కల్లాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కానిస్టేబుల్ హత్యపై నిరసన

మార్కండేయకాలనీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్‌ను హత్య చేసిన రౌడీ షీటర్ రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ నిజామాబాద్‌లో క్రిమినల్, రౌడీషీటర్ అయిన రియాజ్‌ను విధి నిర్వహణలో ఉన్న ప్రమోద్ అనే కానిస్టేబుల్ అరెస్టు చేసి తీసుకెళుతుండగా పట్టపగలు దారుణంగా హత్య చేశాడని, దీన్ని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కానిస్టేబుల్‌ను హత్య చేసిన రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు అయోధ్య రవీందర్, అడిగొప్పుల రాజు, ముష్కె సంపత్, మునిగాల సంపత్, కదురు గిరి, మ్యాడగోని రవీందర్, ములుకుంట్ల శ్రీనివాస్, రాజేష్ తదితరులున్నారు.

దుమ్మురేగుతున్న జాతీయ రహదారి

- పట్టించుకోని హైవే అథారిటీ



దుమ్ములోనే వెళ్తున్న వాహనాలు

శంకరపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో నిర్మాణ దశలో ఉన్న కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి వాహనాల రద్దీతో దుమ్మురేగుతోంది. కేశవపట్నం, మొలంగూర్ శివారులో నిర్మాణ దశలో ఉన్న జాతీయ రహదారికి నీరు చల్లకపోవడంతో ఆదివారం దుమ్మురేగింది. భారీ వాహనాలు వెనకాల వెళ్లే ద్విచక్ర వాహనదారులు దుమ్ముతో ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రహదారి గుండా ప్రయాణం జరిపే వాహనదారులతో పాటు సమీప గ్రామస్థులు అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై దుమ్ములేవకుండా నీరు చల్లించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఖిల్లా సందర్శనకు వచ్చిన మహిళకు గాయాలు



గాయపడ్డ మహిళ

శంకరపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిల్లా సందర్శనకు వచ్చిన మహిళ ఖిల్లాపై ప్రమాదవశాత్తు జారిపడి గాయపడింది. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ మహిళ మొలంగూర్ ఖిల్లా సందర్శనకు వచ్చారు. ఖిల్లాపైకి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు ఖిల్లాపై జారిపడడంతో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా గాయపడిన మహిళను ఖిల్లా మీద స్ట్రేచర్‌పై అతి కష్టం మీద కిందకు తీసుకురావడానికి సుమారు 3గంటల సమయం పట్టింది. సదరు మహిళను 108 వాహనంలో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తూ కిందపడి ఒకరి మృతి

ముత్తారం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన కొలిపాక కుమారస్వామి(50) శనివారం రాత్రి ఇంటి ముందు ఉన్న డ్రైనేజీ వద్ద ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కుమారస్వామి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఆటో, ఆర్టీసీ బస్సుఢీ : ముగ్గురికి గాయాలు

తిమ్మాపూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఇందిరానగర్ వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంపేట నుంచి కరీంనగర్ వైపు ప్రయాణికులతో వస్తున్న ఆటోను ఇందిరానగర్ శివారులో హైదారాబాద్ నుంచి కరీంనగర్ వస్తున్న జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ బాలరాజుతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న శివ, భూమేష్‌కు గాయాలైనాయి. గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

హుజూరాబాద్ చేపల మార్కెట్‌లో మోసం

- తూకంపై నిలదీసిన ప్రజలు

హుజూరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ సమీపంలోని చేపల మార్కెట్‌లో వ్యాపారులు వినియోగదారులను మోసం చేస్తున్నారు. ఆదివారం తూకంలో మోసాన్ని గుర్తించిన వినియోగదారులు చేపలు విక్రయించే వ్యాపారులను నిలదీశారు. తూకం వేసే బాట్లు రెండు రకాలుగా వ్యాపారులు వినియోగిస్తున్నారు. కిలో చేపలు తీసుకొని వేరే చోట తూకం వేస్తే 150 నుంచి 200 గ్రాములు తేడా వచ్చింది. ఈ విషయంపై చేపల వ్యాపారస్థులను నిలదీయగా, మళ్లీ తూకం వేసి అదనంగా కలిపి ఇచ్చారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చెరువు ఎఫ్‌టీఎల్ భూమిలో 'రియల్' వ్యాపారం

- రూ. 20 లక్షలకే ఐదు గుంటల భూమి ఇస్తామని ప్రచారం
- పోలీసుల రాకతో వ్యాపారుల పరుగులు

మల్యాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొండగట్టులో భూముల ధరలు చుక్కలు చూపిస్తుండగా కొందరు వ్యాపారులు చెరువులో గల ఎఫ్‌టీఎల్ భూమితో రియల్‌ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. ఆకర్షణీయమైన ఆఫర్లతో ఎలాంటి అనుమతులు లేకుండానే చెరువులో గల భూమిని చదును చేసి ప్లాట్లుగా విభజించడమే కాకుండా అధిక రాబడి ఆశ చూపి వాటి విక్రయాలను చేపట్టారు. దీంతో కొందరు పోలీసులకు, గ్రామపంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. మల్యాల మండలం ముత్యంపేట గ్రామ పరిధిలోని దిగువ కొండగట్టు సమీపంలోని తుమ్మచెరువులో గల ఆరు ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేసిన జగిత్యాలకు చెందిన కొందరు వ్యాపారులు పంచాయతీ లేఅవుట్‌కు సంబంధించి అనుమతులు ఏమీ తీసుకోకుండానే ప్లాట్లుగా విభజించారు. ఆ భూమి ఎఫ్‌టీఎల్‌లో ఉండగా శ్రీ ఆంజనేయ ప్రకృతి ఫామ్‌ల్యాండ్ పేరిట బ్రోచర్లు ముద్రించి వ్యాపారులు చెరువులో చదును పనులు పూర్తి చేసినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం యాటీ ఇన్‌ఫ్రా గ్రూప్ పేరిట కస్టమర్లతో విందు భోజనం ఏర్పాటు చేశారు. పదుల సంఖ్యలో కస్టమర్లు అక్కడి చేరుకున్నారు. రూ.20లక్షలకే ఐదు గుంటల భూమి అని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయ్యాక కొన్ని సంవత్సరాలలోనే కొనుగోలు చేసిన డబ్బు తిరిగి ఇస్తామని ఆకర్షణీయమైన రాబడి పేరుతో ప్రచారం చేశారని తెలిసింది. అలా కాని పక్షంలో రోజుకి రెండు వేల చొప్పున అలాగే గంధపు చెట్లు నాటి ఐదేళ్ల పూర్తి అయ్యాక దిగుబడి లాభంలో వాటా అని ప్రచారం చేయడంతో ఇక్కడకు వచ్చినట్లు కొందరు కస్టమర్లు తెలిపారు. దీంతో కొందరు పోలీసులకు సమాచారం అందించగా వ్యాపారులు పరారీకి యత్నించినట్లు తెలిసింది. కాగ ఈ విషయమై కార్యదర్శి స్వప్నను వివరణ కోరగా పంచాయతీ అనుమతులు తాము ఇవ్వలేదని, చెరువులో లేఅవుట్‌పై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని కార్యదర్శి పేర్కొన్నారు.



చెరువులో చదును చేసిన భూమి

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

చందుర్తి అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి):చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన మట్టెల తిరుపతి (35) అనే యువకుడి మృతదేహం ఆదివారం సాయంత్రం లభ్యమైంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మట్టెల దేవయ్య భాగ్యవ్వ కుమారుడు తిరుపతి మతిస్థిమితం లేక ఇంటి వద్దనే ఉంటున్నాడు. సెప్టెంబర్ 29న గ్రామంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. అప్పటి నుండి కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం సాయంత్రం కిష్టంపేట గ్రామ శివారులో పూడూరు బాపూరావు అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో తిరుపతి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

మస్కట్‌లో రాచర్ల గొల్లపల్లి వాసి మృతి



శ్రీకాంత్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఆకుల శ్రీకాంత్(32) మస్కట్ దేశంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు స్థానికులు ఆదివారం రాత్రి తెలిపారు. ఆయన మృతి వార్త కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో గ్రామంలో పండుగ పూట విషాదం అలుముకుంది. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామంలోని ఆకుల రేణుక- అంజాగౌడ్ దంపతుల కొడుకు శ్రీకాంత్. స్థానిక కల్లు దుకాణంలో పనిచేస్తుండేవాడు. సరైన పనులు లేకపోవడం వల్ల హైదరాబాద్‌లో ప్రైవేటు సంస్థలో చేరి విధులు నిర్వహించాడు. చేతి నిండా పనులు లేక సుమారు రూ.3 లక్షల అప్పుల పాలయ్యాడు. దాంతో ఉపాధి కోసం నాలుగు నెలల కిందట మరో రూ.3 లక్షలు బాకీలు చేసి మస్కట్ దేశానికి వలస వెళ్లాడు. గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. చివరికి పరిస్థితి విషమించి చనిపోయాడు. కొడుకు చనిపోయాడనే వార్త తెలియడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. కాగా భారత రాయబార కార్యాలయం, ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

జిల్లా ఖో-ఖో సంఘ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



క్రీడాకారులతో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ మహిళలు, పురుషుల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన సుడా చైర్మన్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉన్నతస్థాయికి ఎదిగేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. గతంలో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభచాటి జిల్లా క్రీడా పతాకిన్న అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించారని, మున్ముందు మరింత మంది అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని అన్నారు. నిత్య శిక్షణతోనే క్రీడల్లో రాణించేందుకు అవకాశాలు ఉంటాయని అన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచేందుకు కృషి చేయాలన్నారు. ఖో-ఖో క్రీడలో కరీంనగర్‌కు మంచి పేరు ఉందని గుర్తుచేశారు. ఈ పోటీల్లో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి 225 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఖో-ఖో క్రీడను నిర్వహించి రాష్ట్రస్థాయిలో పాల్గొనే శిక్షణ శిబిరానికి 20 మంది మహిళలు, 20 మంది పురుషులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బాషబోయిన వేణుగోపాల్, జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు, సంఘ ఉపాధ్యక్షులు, కరీంనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, కోశాధికారి చిట్టి తిరుపతిరెడ్డి, జగిత్యాల జిల్లా సంఘ ప్రతినిధి డాక్టర్ ఏ రవీందర్, సిరిసిల్ల జిల్లా సంఘ ప్రతినిధి ఎస్‌కే మోహినుద్దీన్, కరీంనగర్ జిల్లా సంఘ సభ్యులు వి సూర్యప్రకాష్, కట్ట సంతోష్, వి శ్రీలత, రేణుక, యోగేష్, కరుణాకర్, అశోక్, రాజబాబు, అంతర్జాతీయ ఖో-ఖో క్రీడాకారులు పండుగ ఆనంద్, వెంకటేష్, రాజు, జలంధర్, కోచ్ ఇ నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు. పోటీల ముగింపు సమావేశానికి పెద్దపల్లి జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఎ సురేష్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు ఎ లక్ష్మణ్, మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ టి రమేష్ హాజరయ్యారు.

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఖజానా దోచుకున్నారు

- బలహీనవర్గాల మంత్రులపై హరీష్‌రావు అవహేళన
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కరీంనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఖజానాను దోచుకోవటం, దాచుకోవటం తప్ప ప్రజల సంక్షేమం పట్టించుకోలేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలసి ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎలా కూలింది? కోట్ల రూపాయల అవినీతికి బాధ్యులు ఎవరు? కేసీఆర్ కుటుంబ సభ్యులరాలు కవిత ఆరోపణలపై మాజీ మంత్రి హరీష్‌రావు ముందుగా సమాధానం చెప్పాలన్నారు. హరీష్‌రావు 2003కు ముందు, 2023లో ఆస్తులు ఎంత అనేవి వెల్లడించాలన్నారు. రబ్బరు చెప్పులు వేసుకున్న హరీష్‌రావు నేడు వేల కోట్ల ఆస్తులు సంపాదించారని పత్రికలే రాశాయని అన్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో వ్యక్తిగత అంశాలను చర్చించారని, దండుపాళ్యం పాలన అంటూ హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి మండిపడ్డారు. సిద్దిపేట వెంకటేశ్వర స్వామి ఆలయానికి రానున్న శనివారం తాను వస్తానని, తన తల్లిదండ్రులపై ప్రమాణం చేసి క్యాబినెట్‌లో జరిగిన ప్రతి అంశాన్ని స్వామి సాక్షిగా చెబుతానని మాజీ మంత్రి హరీష్ రావ్‌కు సవాలు విసిరారు. దళిత, బలహీనవర్గాల మంత్రులున్న క్యాబినెట్‌పై అవహేళన చేయడం తగదన్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో ప్రజా సంక్షేమం, విద్య, బీసీ రిజర్వేషన్లు, దళిత సంక్షేమం వంటి అంశాలపై లోతుగా చర్చ జరిగిందని మంత్రి తెలిపారు. నీతి, ధర్మం, న్యాయం ఉంటే సవాల్ స్వీకరించాలని, తెలంగాణ ప్రజలను తప్పుడు సమాచారంతో తప్పుదారి పట్టించడం దారుణమన్నారు. నేరెళ్ల ఘటనపై కవిత చేసిన ఆరోపణలకు కూడా జవాబు చెప్పాలన్నారు. దళిత, బీసీ వర్గాల ఎదుగుదల మీకు ఇష్టం లేదా అని ప్రశ్నించారు. గతంలో ఉప ముఖ్యమంత్రి రాజయ్య, మంత్రి కొప్పుల ఈశ్వర్‌లను కూడా కేసీఆర్ అవమానించారన్నారు. కానీ ఈరోజు రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం దళితులకు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యమంత్రి స్వయంగా తనను పక్కన కూర్చోబెట్టుకుని తన శాఖ సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీల రిజర్వేషన్లపై మా చిత్తశుద్ధి ఏమిటనేది ప్రజలకు తలుసన్నారు.

ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీ తీర్మానాల సమయంలో కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రాలేదని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లాకు చెందిన నీటిని సిద్ధిపేటకు మళ్లించడం ఏ న్యాయం? ఇది సరికాదన్నారు. హరీష్‌రావు నోరు అదుపులో పెట్టుకోవాలని, ప్రజా ప్రతినిధిగా బాధ్యతగా మాట్లాడాలని హెచ్చరించారు. ప్రభుత్వానికి ఇంకా మూడేళ్ల సమయం ఉందని, ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతామన్నారు. సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొరివి అరుణ్ కుమార్, మైనార్టీసెల్ ప్రెసిడెంట్ తాజుద్దీన్, దండి రవీందర్, చెర్ల పద్మ, సమద్ నవాబ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గర్రెపల్లి, భూపతిపూర్ దుకాణాల్లో చోరీలు


సుల్తానాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి, భూపతిపూర్ గ్రామాల పరిధిలోని రోడ్డు పక్కనున్న దుకాణాలలో ఆదివారం దొంగతనాలు జరిగాయి. గర్రెపల్లి స్టేజీ వద్ద ఉన్న శ్రీకృష్ణ జెర్సీ పాల దుకాణం, చాయ్ కొట్టు, అలాగే భూపతిపూర్ గ్రామశివారు లోని షట్టర్ల పక్కన ఉన్న టేలాలు, చికెన్ సెంటర్‌లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. ఈ షట్టర్లను ఇనుపరాడ్ల సహాయంతో తొలగించి దొంగతనానికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. రోడ్డు పక్కనున్న పాల దుకాణంలో చోరీకి వచ్చిన వ్యక్తి ఆ షాపులో చేస్తున్న దొంగతనాల దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా దొంగలను పట్టుకో వాలని బాధితులు కోరుతున్నారు. గర్రెపల్లి స్టేజీ ఏరియాలో రాత్రి పూట పోలీసులు పెట్రోలింగ్ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. దొంగతనానికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సమాధుల వద్ద దీపావళి సంబరాలకు సిద్ధం



సమాధుల స్థలంలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కరీంనగర్ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్ఖానగడ్డ, సవరన్ స్ట్రీట్, ఆదర్శనగర్ శ్మశాన వాటికలు దీపావళి సంబరాలకు సిద్ధమయ్యాయి. 10 దశాబ్దాలుగా సమాధుల వద్ద దీపావళి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీపావళికి ఒకటి రెండు రోజుల ముందు నుంచే సమాధులకు రంగులు, సున్నాలు వేసి అలంకరించి దీపావళి నాడు సమాధుల వద్ద వారికిష్టమైన పదార్థాలు నైవేద్యంగా సమర్పిస్తారు. టపాసులు కాల్చి గతించిన వారి స్మృతిలో గడుపుతారు. ఎక్కడెక్కడో ఉన్న కుటుంబ సభ్యులంతా వ్యయ ప్రయాసలకోర్చి ఒకే చోట కలుసుకొని కష్ట సుఖాలు కలబోసుకొని పెద్దలను గుర్తు చేసుకుంటారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సమాధుల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.



సమాధుల స్థలంలో తొలగిస్తున్న చెత్త

కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లపై చొరవ తీసుకోవాలి

● రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నంకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల ఆకాంక్ష 42శాతం బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం, ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, ఎంపీలు తెలంగాణ బిడ్డలుగా చొరవ తీసుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం సాయంత్రం వేములవాడలో శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖర భారతిస్వామి ధర్మ విజయయాత్రలో పాల్గొనడానికి వెళ్తున్న పొన్నం ప్రభాకర్‌ను సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపునకు రాజకీయ పార్టీల మద్దతుతో పాటు ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా జరిగిందన్నారు. ప్రజల ఆకాంక్ష, రాజకీయ పార్టీల ఏకాభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వం గమనించాలన్నారు. 50 శాతం పరిమితి రాజ్యాంగంలో ఎక్కడా లేకున్నప్పటికీ న్యాయస్థానాల పేరుతో ఆపే ప్రయత్నం జరగకుండా గతంలో ఈడబ్ల్యూఎస్ 10 శాతం ఏ విధంగా ఇచ్చారో అదే పద్ధతిలో బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. తెలంగాణలో ప్రామాణికంగా కుల గణనతో లెక్కలు తీయడం జరిగిందన్నారు. తమిళనాడులో వేరే పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ గతంలో పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షను గౌరవించినట్లు ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. దీనికి కేంద్ర మంత్రులు, ఎంపీలు చొరవ చూపాలన్నారు. బీసీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. పొన్నంను స్వాగతించిన వారిలో కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాష్, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, ఆకునూరు బాలరాజు, కత్తెర దేవదాస్, స్వరూపరెడ్డి, వనిత, చంద్రకళ, ఆడెపు ప్రభాకర్, దేవరాజు, గోనె ఎల్లప్ప, దేవయ్య , శ్రీనాథ్, మహేష్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

దత్తాత్రేయ స్వామి ఆలయం
పర్యాటకం పై శీతకన్ను

- స్వామివారి నిత్య పూజలకు తప్పని ఇబ్బందులు
- ఎంపీ నిధులతో బోటు సమకూర్చినా స్పందించని వైనం
- బోటు ఆపరేటర్‌ను నియమించని ప్రభుత్వం



దత్తాత్రేయ స్వామి గుట్ట

బోయినపల్లి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలం వరదవెల్లి సమీపంలోగల దత్తాత్రేయ స్వామి ఆలయంలో నిత్య పూజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దత్తాత్రేయ స్వామి గుట్ట చుట్టూ ప్రతి వర్షా కాలంలో మిడ్ మానేరు జలాలు పెరగడంతో గత ఏడాది కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎంపీ నిధుల ద్వారా బోటును కొను గోలు ఇచ్చారు. అయితే ప్రయాణానికి పర్యాటక శాఖ అనుమతి రాకపోవడంతో బోటు ఆపరేటర్‌ను నియమించడం లేదు. దీంతో స్వామివారికి నిత్య పూ జలు చేయలేక పోవడంతో పాటు భక్తులకు సైతం దర్శన భాగ్యం కరువైంది. పలుమార్లు బోట్ సౌక ర్యానికి పర్యాటక శాఖ అధికారులకు ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో వినతి పత్రాలు ఇచ్చిన స్పందించడం లేదని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



నిరుపయోగంగా ఉన్న బోటు

డిసెంబరులో స్వామివారి జయంతి ఉత్సవాలు...

శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రతి ఏడాది డిసెంబరు మాసంలో జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. జయంతి ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు సైతం వస్తుంటారు.

పర్యాటక శాఖ అధికారులు స్పందించాలి..



- ఆడెపు రాజు, ఆలయ కమిటీ సభ్యుడు..

స్వామివారికి నిత్య పూజలకు ఆటంకం తలెత్తింది. పర్యాటక శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే బోటు ఆపరేటర్‌ను నియమించి స్వామివారి దర్శన భాగ్యం భక్తులకు కల్పించాలి.

సమస్య పరిష్కారానికి కృషి...

- కుస రవిందర్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు



పర్యాటక శాఖ నుంచి బోటు ఆపరేటర్ లేకపోవడంతో స్వామివారి నిత్య పూజలు లేకపోవడంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. సమస్యను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకువెళ్లి ఆపరేటర్ నియామకానికి కృషి చేస్తా.

జగిత్యాలలో కొండ చిలువ



జగిత్యాలలో కనిపించిన కొండ చిలువ

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో శనివారం రాత్రి భారీ కొండ చిలువ కలకలం సృష్టించింది. పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో గల పద్మనాయక కళ్యాణమండపం దుకాణాల సముదాయం వద్ద కొండ చిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు కొండ చిలువను పట్టుకుని అడవిలో వదిలి వేసినట్లు తెలిపారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

తిమ్మాపూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పిట్టల కుమార్ ఆరు నెలల క్రితం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. సిఐఈఆర్ పోర్టల్ ద్వారా ఎల్ఎండీ పోలీసులు పోయిన ఫోన్‌ను కనుగొన్నారు. ఆదివారం పిట్టల కుమార్‌కు ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఫోన్ అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే సిఐఈఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురి పట్టివేత

వీణవంక,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని పట్టుకున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి కుటుంబ సభ్యులకు దూరమవుతారన్నారు. మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడితే జైలు శిక్షతో పాటు జరిమానా పడే అవకాశం ఉందని తెలిపారు.

సామాజిక రుగ్మతలను రూపుమాపాలి

● జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్‌రావు

వేములవాడ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు జనవిజ్ఞాన వేదిక ప్రయత్నం చేస్తుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్‌రావు అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా వార్షి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక సైన్స్‌ను ప్రచారం చేస్తూ సామాజిక రుగ్మతలను తొలగించే ప్రయత్నం చేస్తుందని అన్నారు. విద్య, వైద్యంతో పాటు అనేక సామాజిక సమస్యలపై అహర్నిశలు పోరాడుతూ సామాన్య ప్రజానీకానికి సైన్స్ ఫలాలు అందాలని కోరుకుంటుందని అన్నారు. సైన్స్ పట్ల భారతదేశ కృషి ఆశించిన స్థాయిలో లేకపోవడం, ప్రపంచ దేశాల్లో నోబెల్ బహుమతి పొందడంలో మన దేశం చాలా వెనుకబడిపోయిందన్నారు. ఇంత వరకు భారతదేశం నుంచి నోబెల్ ప్రైజ్ పొందినవారు భారత సంతతికి చెందిన నలుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రావుల వరప్రసాద్, జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి మహేందర్, అంజనేయులు, రామరాజు ఉన్నారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలపై ఫోకస్

- చైర్మన్ పదవి 'చే'జిక్కించుకునేందుకు కసరత్తు
- బీజేపీ, బీఆర్ఎస్ నుంచి ప్యానల్స్ నిలిపే అవకాశం
- రేపటి నుంచి నామినేషన్లు షురూ



కరీంనగర్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు రాజకీయ వేడిని పుట్టిస్తున్నాయి. ఎనిమిదేళ్ల తర్వాత నవంబరు 1న జరిగే పాలకవర్గ ఎన్నికలపై ప్రధాన పార్టీలు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జరిగే ఈ ఎన్నికల్లో గెలిచి అదే ఊపును ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికల్లో కూడా కొనసాగించేందుకు పార్టీలు వ్యూహ రచన చేస్తున్నాయి. రాజకీయాలకతీ తంగా అర్బన్ బ్యాంకు ఎన్నికలు నిర్వహిస్తున్నప్ప టికీ అన్ని పార్టీలు వారి ప్యానళ్లను ఏర్పాటు చేసి బ్యాంకును కైవసం చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి.

- ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జి కమిటీ పదవీకాలం ఈ నెల 14న ముగిసింది. అర్బన్ బ్యాంకును కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పటికే ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. మాజీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ ఛైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, మాజీ ఇన్‌చార్జి ఛైర్మన్ కర్ర రాజశేఖర్ ఇద్దరు కాంగ్రెస్ నేతలే.. ఎవరికివారు ప్యానల్స్‌పై దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మాజీ డైరెక్టర్లు, కొంత మంది సీనియర్ నాయకులతో ప్యానల్‌ను ఏర్పాటు చేసి ఎన్నికల్లో నిలుపుతారనే ప్రచారం జరుగుతోంది.

- కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ పదవితోనే రాజకీయాల్లో వచ్చారు. ఆయనకు బ్యాంకుపై పట్టు ఉంది. ఆయన డైరెక్టర్ అయిన రోజుల్లో ఛైర్మన్‌గా ఉన్న డి శంకర్ ప్రస్తుతం బీజేపీలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ ప్యానల్‌ను తయారు చేస్తే తప్పకుండా సంజయ్ నాయకత్వంలో బ్యాంకును కైవసం చేసుకోవచ్చని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అధ్యక్షతన అర్బన్ బ్యాంకు ఎన్నికలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బ్యాంకు ఎన్నికల్లో పోటీ విషయమై చర్చించి కేంద్రమంత్రి బండి సంజయ్ అనుమతితో బరిలో నిలిపేందుకు నిర్ణయించినట్లు తెలిసింది.

- బ్యాంకు మాజీ ఛైర్మన్ కర్ర రాజశేఖర్ గతంలో బీఆర్ఎస్‌లో ఉండగా ఆయన ఛైర్మన్‌గా, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని వేయించారు. ప్రస్తుతం రాజశేఖర్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లగా మిగిలిన సభ్యులు ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కూడా అర్బన్ బ్యాంకు ఎన్నికలపై ఒకటి రెండు రోజుల్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్యానల్‌ను తయారు చేస్తారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

మూడు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు పోటీకి సిద్ధమవుతుండడంతో అర్బన్ బ్యాంకులో రాజకీయవేడి రాజుకుంటోంది. సోమవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికలకు 10 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. దీపా వళి నుంచి ప్రచారాన్ని సాగించి విజయం సాధిం చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయి కనిపించింది. ఆదివారం సెలవు రోజు కావడంతో రాజన్న దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండం లో పవిత్రస్నానాలను ఆచరించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని తరించారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాసం సమీస్తుండటంతో భక్తులు రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏర్పాట్లు పరిశీలించిన విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రాజన్న ఆలయానికి శృంగేరి జగద్గురు శ్రీ విధుశేఖర భారతి స్వామి వారు వస్తున్న సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టచర్యలు తీసుకోవాలని ఆలయ ఉద్యోగులకు సూచించారు. స్వామి వారిని దర్శించుకున్నారు.

ధర్మపురిలో ధనలక్ష్మి పూజలు



ధర్మపురి ఆలయంలో ధనలక్ష్మి పూజలు

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో గల అద్దాల మండపంలో ఆదివారం సాయంత్రం ధనలక్ష్మి పూజలు అత్యంత వైభవంగా ప్రారంభించారు. దీపావళి పర్వదినం పురస్కరించుకుని మండపం వద్ద లక్ష్మీదేవి చిత్రపటాన్ని ఉంచి ఆలయ వేదపండితులు పూజలు నిర్వహించారు. రాత్రి వరకు అనేక మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. కార్యక్రమం లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

ఆశ్వయుజ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక శ్రీలక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ ఉగ్ర నరసింహ, శ్రీ వేంకటేశ్వర, శ్రీ రామలింగేశ్వర స్వామి, గణపతి ఆలయాల్లో ఆలయ వేద పండితుల పూజలు చేశారు. భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు.

కర్మను అనుసరించి ఫలితం ఉంటుంది

● ఈశ్వరుడి అనుగ్రహంతోనే అభివృద్ధి పనులు ● శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి



అనుగ్రహభాషణం చేస్తున్న విధుశేఖర భారతి మహాస్వామి



రాజన్న ఆలయ మాస్టర్ ప్లాన్‌ను వీక్షిస్తున్న భారతి మహాస్వామి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మనిషి పాటించే కర్మలను అనుసరించి ఫలితం ఉంటుందని, మనం విషబీజం నాటితే విషపు ఫలాలే వస్తాయని, మంచి బీజం నాటితే మంచి ఫలాలు వస్తాయని శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి భక్తులకు సూచించారు. ధర్మ విజయయాత్రలో భాగంగా ఆదివారం రాత్రి వేములవాడ క్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో భక్తులకు అనుగ్రహణభాషణం చేశారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం ఎంతో పరమపవిత్రమైనదని, మహిమాన్వితమైన క్షేత్రంగా వర్ధిల్లుతుందని అన్నారు. పరమశివుడిని భక్తులు ఎంతో విశేషంగా, సర్వశ్రేష్ఠంగా ఎంతో నమ్మకంతో కొలుస్తారని అన్నారు. భక్తుల సౌకర్యార్థం, అభివృద్ధి కోసం శాస్త్రోక్త విధానాలతో సంపన్నం చేసేందుకు విశేషంగా అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. పరమేశ్వర తత్వం అద్భుతమైనదని, ఈశ్వరుడ మంగళకారుడని, ప్రతి ఒక్కరి మంచికోరే తత్వమని తెలిపారు. మనం చేసే పనులతోనే మనం కర్మ ఫలాన్ని అనుభవిస్తామని అన్నారు. ఈశ్వరుడు సర్వాంతర్యామీ అని మంచి చెడులను అర్థం చేసుకునే సంకల్పం ఉండాలని సూచించారు.

ప్రణాళిక ప్రకారం రాజన్న ఆలయ అభివృద్ధి పనులు

- మంత్రి పొన్నం ప్రభాకర్

శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి మార్గదర్శనం మేరకు వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు పక్కా ప్రణాళికతో చేపడుతామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శ్రీ విధేశేఖర భారతి మహాస్వామి అనుగ్రహ భాషణం చేసేముందు పొన్నం మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం రాజన్న ఆలయ అభివృద్ధి అని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిపై స్వామి వారు మార్గదర్శనం చేయాలని తమ సూచనలతో ముందుకు వెళుతామని విజ్ఞప్తి చేశారు. ఆలయ అభివృద్ధిలో ఎలాంటి రాజకీయాలు లేదని స్పష్టం చేశారు.

శృంగేరి పీఠాధిపతుల సూచనలతోనే..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు శృంగేరి పీఠాధితుల సలహాలు, సూచనల మేరకు ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శృంగేరి పీఠాధిపతి అనుగ్రహ భాషణంకు ముందు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కృషితో ఆలయాభివృద్ధికి ముందడుగు వేశామని అన్నారు.భక్తుల విశ్వాసాలు, అభిప్రాయాలు, పండితులు, ఇతర ప్రముఖుల సలహాలు, సూచనల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. మొదటి దశలో రే. 76 కోట్లతో ప్రధాన ఆలయ విస్తరణ, అభివృద్ధి, రూ. 35 కోట్లతో అన్నదాన సత్రం, రూ. 47 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఆయన వెంట ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, ఆలయ ఈవో రమాదేవి తదితరులు ఉన్నారు.

పీఠాధిపతికి ఘన స్వాగతం

వేములవాడ కల్చరల్ : శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి ధర్మ విజయ యాత్రలో భాగంగా వేములవాడకు చేరుకున్నారు. ఆదివారం రాత్రి పట్టణంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ మహేష్ బి గీతె, అడిషనల్ ఎస్పీలు శేషాద్రినిరెడ్డి, చంద్రయ్యలు పూలమాలలు అందజేసి ఘనస్వాగతం పలికారు. భక్తులు భారీ గజమాల సమర్పించారు. మహిళలు హారతులు పట్టారు.

కొండగట్టులో అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట

కొబ్బరి కాయలు కొట్టేందుకు డబ్బులు వసూలు చేస్తున్న సిబ్బంది తొలగింపు



కొబ్బరికాయ కొడుతున్న భక్తులు

మల్యాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో భక్తులు స్వామి వారి దర్శనం అనంతరం చెల్లించుకునే కొబ్బరి మొక్కుల వద్ద భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారే పిర్యాదులపై దేవస్థానం అధికారులు స్పందించారు. కొబ్బరి కాయలు కొట్టె చోట ముక్కల సేకరణ సిబ్బందిని తొలగించారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి ముక్కల సేకరణ కాంట్రాక్టర్ కొబ్బరి ముక్కలను సేకరించుకోవాల్సి ఉంటుండగా సేకరణ సమయంలో సిబ్బంది ఒక్కో కొబ్బరికాయ కొట్టడానికి సగం ముక్క తీసుకుంటూనే రూ.10వరకు వసూలు చేయడంపై కొన్నేళ్లుగా భక్తులు దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకెలుతూనే ఉన్నారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దల్ తదితర హిందూ సంస్థలు కూడా పలు మార్లు డబ్బులు వసూలు చేసే సిబ్బందిని పట్టుకొని అధికారులకు అప్పగించారు. అయినప్పటికీ వసూల్లు ఆగకపోవడంపై అనేక అనుమానాలకు తావునిచ్చింది. దీంతో ఇటీవల అధికారులు సిబ్బందిని అక్కడి నుంచి తొలగించడమూ కాకుండా డబ్బులు చెల్లించకూడదనే బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో సాఫీగా భక్తులు స్వామి వారికి కొబ్బరి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఆనంద రవళి.. దివ్య దీపావళి..

(5వ పేజీ తరువాయి)


దీపాలు వెలిగిస్తున్న యువతులు

కొత్త ఖాతాలు ప్రారంభి స్తారు. ఉత్తర భారతంలో మహాలక్ష్మికి, దక్షిణాదిలోని కేరళలో పాతాళం నుంచి బలిమహారాజు భూమిపైకి వచ్చి దర్శన మిస్తాడని భావిస్తారు.

వాట్సాప్, ఫేస్‌బుక్‌లో మెరుపులు

ఆధునిక సాంకేతికంగా అభివృద్ధి చెందు తున్న సోషల్ మీడి యాలో వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లతో పాటు వివిధ యాప్‌ల ద్వారా దీపావళి శుభాకాంక్షలు హల్‌చల్ చేస్తున్నాయి. విభిన్నమైన యాప్స్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. రకరకాల ఫొటోలతో టపాసులు పేలుస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

దూది పూల కష్టాలు

- కూలీల కొరతతో సతమతం
- అంతర్ రాష్ట్ర కూలీలపైనే ఆధారం
- జిల్లాలో 46,385 ఎకరాల్లో సాగు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కురవకపోవడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో పత్తి రైతులు విత్తనాలు రెండోసారి వేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. తర్వాత కురిసిన వర్షాలు రైతుల్లో ఆనందాన్ని నింపాయి. దిగుబడి వచ్చే సమయంలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో పత్తి రైతులు అతలాకుతలం అవుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో పత్తి నల్లబారడం, పూత రాలిపోవడంతో దిగుబడి లేక రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు పత్తి ఏరడానికి కూలీలు దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో వ్యవసాయ కూలీల కొరత తీవ్రంగా ఉంది. వ్యవసాయ పనులకు అంతర్ రాష్ట్ర కూలీలపైనే ఆధార పడాల్సి వస్తోంది. వరి నాట్ల నుంచి మొదలుకొని పత్తి ఏరడం వరకు బీహార్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్ ప్రదేశ్, బెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూలీలు జిల్లాకు వలస వస్తుంటారు. పత్తి దిగుబడి రావడం మొదలైనా ఇంకా కూలీలు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పొరుగు జిల్లాల నుంచి రవాణా చార్జీలు చెల్లించి కూలీలను రప్పిస్తున్నారు. కూలీలకు రోజుకు రూ.350 వరకు కూలి డబ్బులు చెల్లిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలకు కిలో రూ.12 నుంచి రూ.15 వరకు చెల్లిస్తున్నారు.


రాజన్న సిరిసిల్ల జిల్లాలో పత్తి ఏరుతున్న వలస కూలీలు(ఫైల్)

● దిగుబడి కష్టమే..

అధిక వర్షాలతో తెల్ల బంగారంపై రైతులు పెట్టుకున్న ఆశలు ఆవిరి అవుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 46,385 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గంభీరావుపేటలో 85 ఎకరాలు, ఇల్లంతకుంటలో 12000, ముస్తాబాద్‌లో 530, సిరిసిలలో 800, తంగళ్లపల్లిలో 870, వీర్నపల్లిలో 300, ఎల్లారెడ్డిపేటలో 3600, బోయినపల్లిలో 6400, చందుర్తిలో 6200, కోనరావుపేటలో 4800, రుద్రంగిలో 2200, వేములవాడలో 4800, వేములవాడ రూరల్‌లో 3800 ఎకరాల్లో పత్తి పండించారు.

అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు పత్తి నల్లగా మారింది. పూత రాలిపోవడంతో పాటు కాయలు కుళ్లిపోయాయి. దిగుబడి కష్టమేనని భావిస్తున్నారు. అధిక వర్షాలకు పత్తి పంట దెబ్బతిని రైతులు నష్టపోయారు.

ఘనంగా కుంకుమ పూజలు


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని శివకేశవ స్వామి ఆలయంలో ఆదివారం లక్ష్మీదేవీ కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు విశ్వనాథశర్మ, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలను జరిపించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బృందం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

చందుర్తి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపేటలో ఒర్రె నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి బ్లూకోల్ట్స్ పోలీస్‌లు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై ఎస్సై రమేష్‌ను వివరణ కోరగా విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

లచ్చన్న ఆశయాలను కొనసాగించాలి

- అనారోగ్యంతో కార్మికవర్గ ఉద్యమ నాయకుడి మృతి
- అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు


ఎర్ర జెండాలు పట్టుకుని అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు, ఇన్‌సెట్‌లో మృతుడు లచ్చన్నగౌడ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామానికి చెందిన కార్మికవర్గ ఉద్యమ నాయకుడు తాళ్లపల్లి లచ్చయ్య గౌడ్ అలియాస్ లచ్చన్నగౌడ్(81) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందారు. ఇటీవల చెట్టుపై నుంచి కింద పడి తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ మరణించారు. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకుడు వేణు, ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎర్ర జెండాలను చేత పట్టుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అరుణోదయ సాంస్కృతిక సంస్థ నాయకురాలు విమలక్క సెల్‌ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య కౌసల్య, ఇద్దరు కొడుకులు సురేశ్, ప్రభాకర్, కూతుళ్లు అనిత, సుశీల ఉన్నారు.

కార్మిక హక్కుల సాధనకు నిరంతరం పోరాటం

- జిల్లా మహా సభల కరపత్రాల ఆవిష్కరణ


వీర్నపల్లిలో కర పత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం ఉద్యమిస్తోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కడారి రాములు అన్నారు. ఈనెల 26న వేములవాడలో నిర్వహించే జిల్లా మహా సభలకు సంబంధించిన కర పత్రాలను ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో ఆ సంఘం నాయకులతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి 1920లో ఏఐటీయూసీ ఆవిర్భావించిందని అన్నారు. నాటి నుంచి కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతోందని అన్నారు. సభలో కార్మికుల పడుతున్న ఇబ్బందులు, ప్రభుత్వ తీరు, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై చర్చించడం జరుగుతోందని అన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మహా సభలను జయప్రదం చేయాలని రాములు కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, అజ్జు, వేణు, బాలరాజు, లక్ష్మీ, దేవవ్వ, సత్తవ్వ, రాజవ్వ, నర్సవ్వ, మనెవ్వ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సబేరాబేగం, కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్ధతు ధరను పొందాలని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు చేపట్టామని అన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సంఘం వైస్ చైర్మన్ సత్తయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు నర్సయ్య, వెంకటనర్సింహారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, మజీద్, నారాయణరెడ్డి, బుచ్చిరెడ్డి, స్వామి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ఉద్యోగ, ఉపాధ్యాయ రాష్ట్ర సెల్ చైర్మన్ నరహరి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా వారికి రావాల్సిన ప్రయోజనాలకు సంబంధించిన డబ్బులు విడుదల చేయాలన్నారు. దీపావళి సందర్భంగా కనీసం రెండు డీఏలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు

అద్దె భవనాల్లో గురుకుల పాఠశాలలు

- నెలకు లక్షల రూపాయల అద్దె చెల్లిస్తున్న ప్రభుత్వం - స్వంత భవనాలు నిర్మించాలని విద్యార్థి సంఘాల డిమాండ్

వేములవాడ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే కృతనిశ్చయంతో గురుకులపాఠశాలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. గురుకుల పాఠశాలలోని విద్యార్థులు ఉన్నత ర్యాంకులతో సత్తా చాటుతున్నప్పటికి విద్యార్థులు చదవుకునే భవనాలు మాత్రం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని గురుకుల భవనాల్లో విద్యార్థులు అరకొర వసతుల మధ్య కాలం వెల్లదీస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ప్రతినెల లక్షల్లో అద్దె చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గ్రామంలోని అయ్యప్ప ఆలయం వెనుకగల మైనార్టీ గురుకుల, జ్యోతిబాపూలే బాలుర వసతిగృహం, కోర్టుకు వెళ్లేదారిలోని జ్యోతిబా పూలేబాలికల వసతిగృహలతోపాటుగా పట్టణంలోని మరికొన్ని గురుకులాలు ఏళ్లుగా అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి.


వేములవాడలో అద్దె భవనంలో కొనసాగుతున్న మైనార్టీ, బీసీ గురుకుల పాఠశాల

నిధులు మంజూరు కాలేదు..

వేములవాడ తిప్పాపూర్ అయ్యప్పా ఆలయం వెనుక ఓ ప్రైవేట్ భవనంలో మైనార్టీ, బీసీ బాలుర గురుకుల పాఠశాల కొనసాగుతోంది. అయితే వేములవాడ రూరల్ మండలంలోని మల్లిపల్లి గ్రామ సమీపంలో 5 ఎకరాల స్థలాన్ని అధికారులు కెటాయించారు. భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు సుమారుగా రూ.20 కోట్లు కావడంతో నేటికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. గురుకుల పాఠశాలకు కెటాయించిన స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి వదిలేయడంతో అట్టి స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగి కనిపిస్తుంది. అంతకు ముందు మైనార్టీ గురుకుల పాఠశాల పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో నెలకు రూ. 1.98 లక్షలతో కొనసాగింది. మైనార్టీ గురుకులంలో 75 శాతం మైనార్టీలకు, 25 శాతం సీట్లు ఇతరులకు భర్తీ చేస్తున్నారు. ఈ క్రమంలో పాఠశాలలో 420 మంది విద్యార్థులు ఒకేషనల్ కోర్సుల్లో 140 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య పెరుగుతూ రావడంతో తిప్పాపూర్ అయ్యప్పా ఆలయం వెనుక గల భవనంలోకి మార్చా రు. సదరు భవనానికి నెలకు లక్షల్లో అద్దె చెల్లిస్తు న్నారని, ప్రభుత్వం దృష్టి సారించి ఇప్పటికైనా మైనార్టీ గురుకుల పాఠశాలకు నిధులు కేటాయించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే నిర్మాణం జరిగేది..

- పోతు అనిల్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు



గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పకుండా గురుకులాలకు స్వంత భవనాల నిర్మాణం తప్పకుండా చేపట్టేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతుంది. స్వంత భవనాలకు నిధులు మంజూరు చేయాలి.

విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.

- జింక అనిల్, బీజేవైఎం నాయకుడు



గురుకుల పాఠశాలలను అద్దె భవనాలలో కొనసాగిస్తున్నారు. వాటికి చెల్లించే అద్దెతో ఇప్పటికే నిర్మాణాలు పూర్తయ్యేవి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకుని అద్దె ఎక్కువ చెల్లించే గురుకులాలకు స్వంత భవనాల నిర్మాణం చేపట్టాలి.

మృతుడి కుటుంబానికి చేయూత

కోనరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన వంగపల్లి కనకయ్య కుటుంబానికి కోనరావుపేట శాలివాహన సంఘం ఆధ్వర్యంలో చేయూతనందించారు. పేదరికంలో ఉన్న ఆ కుటుంబానికి ప్రస్తుత సహాయం కింద 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాలివాహన సంఘం నాయకులు వంగపల్లి శ్రీనివాస్, రమేష్, దేవరాజు, రవీందర్, రామచంద్రన్, రాములు, మల్లయ్య, శేఖర్, మల్లేశం, మనోహర్ తదితరులు ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

కోనరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన రంగం రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ కార్యదర్శి గురిజాల శ్రీధర్ కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 26, 27 తేదీలలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగే మహాసభను మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కారం కోసం చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులు మేకల కవిత, బాలమణి, రాధా, పద్మ, దేవవ్వ, శంకరవ్వ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- పంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

తంగళ్లపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు విమర్శించారు. ఆదివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాజన్న సిరిసిల్ల జిల్లా 4వ మహాసభలు జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య అధ్యక్షతన జరిగాయి. ముందుగా తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు దాచారం భూమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎరవెల్లి ముత్యంరావు మాట్లడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు నిత్యం గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, డంపింగ్ యార్డ్, హరితహారం, వైకుంఠధామాలు, ప్రకృతివనాల నిర్వహణతో పాటు పల్స్‌పోలియో, ఓటరు నమోదు, ఎన్నికల నిర్వహణలాంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో పనులు చేస్తున్నారన్నారు. కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు గాలికి వదిలేస్తున్నాయని మండిపడ్డారు. అట్టడుగు వర్గాలకు సంబంధించిన పంచాయతీ సిబ్బందికి సీఐటీయూ అండగా నిలబడి అనేక ఆందోళన, పోరాటాలు, సమ్మెలు చేసినప్పటికీ ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పంచాయతీ సిబ్బందికి పని భారాన్ని పెంచి వారిని బానిసలుగా మార్చే మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, జీవో నంబరు 51 సవరణ, కేటగిరీలను కొనసాగించడం, వేతనాలను 2వ పీఆర్సీ పరిధిలోకి తీసుకురావడం, వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పర్మినెంట్, అర్హత కలిగిన వారికి పదోన్నతులు, ఇతర సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులందరు ఐక్యంగా పాల్గొని హక్కులను సాధించుకోవాలన్నారు. అనంతరం 33మందితో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కోడం రమణ, అధ్యక్షుడిగా బుర్ర శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా మల్యాల నర్సయ్య, ఉపాధ్యక్షులుగా అన్నల్‌దాస్ గణేశ్, వర్కోలు మల్లయ్య, అక్కల అంజయ్య, లోకిని శ్రీనివాస్, సహాయకార్యదర్శులుగా నారాపురం నర్సయ్య, సందెల మహేష్, మామిడి నరేష్‌లతో పాటు మండలాల అధ్యక్షులు, కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షులు మూషం రమేష్, సహాయ కార్యదర్శి సూరం పద్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల, కంసాని రవి, నేరెల్ల రాజు, అశోక్, కిరణ్, వజ్రవ్వ, జ్యోతి, లచ్చవ్వ, కనకవ్వ, పుష్పల, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

రహదారి వెంట పరుచుకున్న పచ్చదనం..

కోనరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన రహదారి వెంట ఏపుగా పెరిగిన చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రోడ్డుకు ఇరుపక్కల చెట్లు సమృద్ధిగా పెరగడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తూ చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయని తెలుపుతున్నారు. కోనరావుపేట మండలం నాగారం, మర్తనపేట గ్రామాల మధ్య గతంలో ఉపాధిహామీ పనుల కింద నాటిన మొక్కలు చెట్లుగా మారి రోడ్డుకు ఇరుపక్కల సమృద్ధిగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఆ రహదారి వెంట వెళ్తున్న వాహనదారులు చల్లటి ఆహ్లాదాన్ని అందిస్తున్నాయని తెలుపుతున్నారు. అంతేకాకుండా నాగారం శివారు నుంచి కిలోమీటర్ వరకు సీతాఫలం మొక్కలను రోడ్డు పక్కన పెంచుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సీతాఫలాల చెట్లు రోడ్డుకు ఇరుపక్కల నాటితే బాగుంటుందని కోరుతున్నారు.


నాగారం-మర్తనపేట రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్లు

ప్రజా సమస్యలపై పోరాటం..

సుభాష్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడేందుకే ఆర్‌పీఐ(రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా) ఉందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ అన్నారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఆర్‌పీఐ ఏర్పడింది ప్రజల కోసమేనని, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అసలైన నిరుపేదలకు అందడం లేదని అన్నారు. ఆర్‌పీఐ నాయకులు, కార్యకర్తలు ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు మొగురం మీరియా, జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, పెద్దల్లి చంద్రకాంత్, మంచిర్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు జగదంబల లలిత, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ముత్యంరెడ్డి, గందే కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

చందుర్తి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మాజీ ఎంపీపీ తిప్పని శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మై భారత్, ఎన్‌వైకే ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్,షటిల్, చెస్, రన్నింగ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడాలు విజయవంతం చేసినందుకు నిర్వాహకులు పోంచెట్టి రాకేష్ క్రీడాకారులందరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నాయకులు పులి సత్యం, ఎండి అజీమ్, చిలుముల హనుమాయ చారి, మట్కాం మల్లేశం, మార్త రాజు, గుగ్గిల సాగర్, మోతుకూపల్లి రాజశేఖర్, మేడిశెట్టి శ్రీహరి, వెంగల వెంకటేష్, మెంగని అరవింద్, ఎండి ఆసిఫ్, ఇతర క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

విధుశేఖర భారతీస్వామికి ఘనస్వాగతం


పెద్దమ్మ బస్‌స్టేజీ వద్ద విధుశేఖర భారతీస్వామికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

గంభీరావపేట, అక్టోబరు 19 ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం పెద్దమ్మ బస్ స్టేజీ శృంగేరీ జగద్గువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామికి ఆదివారం ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈనెల 17 నుంచి వచ్చేనెల 4 వరకు శృంగేరీ జగద్గురువు విధుశేఖర భారతీస్వామి ధర్మవిజయ యాత్ర కొనసాగనుంది. యాత్రలో భాగంగా కామారెడ్డి జిల్లా మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ వెళుతుండగా గంభీరావుపేట మండలం పెద్దమ్మ బస్ స్టేజీ వద్ద విధుశేఖర భారతీస్వామి భక్తులను చూసి కొద్దిసేపు ఆగారు. అప్పటికే విధుశేఖర భారతీస్వామి కోసం చూస్తున్న ప్రజలు ఒక్కసారిగా పరుగులు తీశారు. విధుశేఖర భారతీస్వామి వద్దకు వెళ్లి ప్రజలు ఆశీర్వాదం తీసుకున్నారు. పెద్దమ్మ బస్ స్టేజీ వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు రావడంతో పోలీస్‌లు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాచర్లగొల్లపల్లిలో..

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి మీదుగా వేములవాడకు వెళుతున్న శృంగేరీ పీఠాధిపతి జగద్గురు శ్రీ విధుశేఖర భారతీ స్వామికి స్థానిక గీత మందిరం వద్ద భక్తులు ఆదివారం స్వాగతం పలికారు. భక్తులను స్వామి వారు ఆశీర్వదించారు. విధుశేఖర భారతీ స్వామి ఆశీర్వాదం పొందడం పూర్వ జన్మ సుకృతమని వేద పండితుడు రాచర్ల రఘురామశర్మ పేర్కొన్నారు. భక్తులు, స్థానికులు ఉన్నారు.